# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 19-12-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం ఈరోజు సమావేశం కానుంది.**

2. **ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ఆర్టీసీ బస్సులను త్వరలోనే ఎలక్ట్రికల్ బస్సులుగా మార్చనున్నామని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వెల్లడించారు.**

3. **తెలంగాణలో ఉపకార వేతన బకాయిలను త్వరలోనే చెల్లిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు.**

4. **ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణాన్ని మూడేళ్లలో పూర్తి చేస్తామని పురపాలక శాఖ మంత్రి పి నారాయణ తెలిపారు.**

5. **తెలంగాణలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష -టెట్ షెడ్యూల్‌ను పాఠశాల విద్యాశాఖ విడుదలచేసింది.**

==========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం ఈ రోజు సమావేశం కానుంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరగనున్న ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించనున్నారు. 43వ సీఆర్డీఏ అథారిటీ సమావేశ నిర్ణయాలు, రేషన్ బియ్యం అక్రమ రవాణా, రాష్ట్రంలో వివిధ సంస్థల పెట్టుబడులు వంటి అంశాలపై చర్చించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ఆర్టీసీ బస్సులను త్వరలోనే ఎలక్ట్రికల్ బస్సులుగా మార్చనున్నామని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వెల్లడించారు. రాయచోటిలో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ,

..వాయిస్ ...38 సెకన్లు

--------------------------

తెలంగాణలో ఉపకార వేతన బకాయిలను త్వరలోనే చెల్లిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ప్రైవేట్ మెడికల్, నర్సింగ్ కళాశాలల ప్రతినిధులతో ఆయన నిన్న సమావేశమై పలు అంశాలపై చర్చించారు. గత రెండేళ్లుగా ఉన్న బకాయిలను చెల్లించాలని కళాశాలల యజమాన్యాలు కోరాయి. గత ప్రభుత్వం బకాయిలను చెల్లించకపోవడంతో ప్రస్తుత ప్రభుత్వంపై భారం పడుతోందని

ఉపముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రతీ కళాశాలకు బకాయిలను చెల్లిస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భట్టి విక్రమార్క వివరించారు.

---------------------------

ప్రజాసమస్యల పరిష్కారానికే 'ధరణి' పోర్టల్‌ను రద్దు చేస్తున్నామని తెలంగాణ రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా 'భూభారతి' బిల్లును మంత్రి నిన్న సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ధరణి స్థానంలో భూభారతిని తీసుకొస్తున్నామని చెప్పారు. 18 రాష్ట్రాల్లో "హక్కుల రికార్డు"– ఆర్‌ఓఆర్ చట్టాలను పరిశీలించి భూభారతి తీసుకొచ్చామని మంత్రి తెలుపుతూ,

...వాయిస్ ..30 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో జికా వైరస్ అనుమానాలపై నమూనాలను పరీక్షిస్తున్నామని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. నెల్లూరులో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, వైరస్ అనుమానిత లక్షణాలున్న వెంకటాపురం గ్రామానికి చెందిన బాలుడ్ని ఇప్పటికే చెన్నై తరలించారని మంత్రి తెలిపారు. బాలుడికి మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. గ్రామంలో ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి పేర్కొంటూ

...వాయిస్ ..22 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణాన్ని మూడేళ్లలో పూర్తి చేస్తామని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, త్వరలో 45 వేల కోట్ల రూపాయలతో పనులు చేపట్టేందుకు టెండర్లు పిలవనున్నామని చెప్పారు. ఐదు ఐకానిక్ టవర్లు, శాసనసభ, హైకోర్టు, అధికారుల నివాసాలు, సుమారు 3 వేల కిలోమీటర్ల ట్రంక్‌రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. రాష్ట్రంలో పాలకమండళ్లు లేని పట్టణ స్థానిక సంస్థలకు జూన్, జులై నెలల్లో ఎన్నికలు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు.

---------------------------

తెలంగాణలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష –టెట్ షెడ్యూల్‌ను పాఠశాల విద్యశాఖ డైరెక్టర్ సబ్జెక్టుల వారీగా విడుదల చేశారు. జనవరి 2 నుంచి 20 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం, సాయంత్రం.. రెండు విడతలుగా 9 గంటల నుంచి 11 గంటల 30 నిమిషాల వరకు ఒక పరీక్ష, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల 30 నిమిషాల వరకు మరో పరీక్షలు జరగనున్నాయి. టెట్ పేపర్–1, పేపర్–2లకు కలిపి సుమారు 2.75 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శౌచాలయల నిర్మాణం, తాగునీటి సదుపాయాలకు 52.68

కోట్ల రూపాయలు విడుదల చేసినట్లు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖపై ఆమె నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 7 వేల 387 కేంద్రాలకు విద్యుత్తు కనెక్షన్ల కోసం ఆయా సంస్థలకు లేఖలు రాసినట్టు తెలిపారు. అంగన్‌వాడీ ద్వారా పిల్లలు సాధించిన పురోగతిపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడానికి ప్రతి నెల అయిదో తేదీన పూర్వ బాల్య దశ సంరక్షణ, విద్య– ఈసీసీఈ దినోత్సవాన్ని నిర్వహించాలన్నారు. ప్రత్యేక డ్రైవ్‌ల ద్వారా 371 మంది పిల్లల్ని భిక్షాటన, కార్మికవృత్తి నుంచి విముక్తి కల్పించామని, 780 బాల్య వివాహాల్ని అడ్డుకున్నామని సంధ్యారాణి తెలిపారు.

---------------------------

ప్రతి పౌరునికీ సామాజిక న్యాయాన్ని అందించేలా డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని రూపొందించారని ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలిలో వివిధ రకాల అంబేద్కర్ విగ్రహాలతో ఏర్పాటుచేసిన ప్రదర్శనను నిన్న సాయంత్రం ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ,

వాయిస్ ...22 సెకన్లు..

---------------------------

కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ ఐఎన్ఎస్ నిర్దేశక్‌ను విశాఖపట్నంలోని నేవల్ డాక్‌యార్డ్‌లో నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా సంజయ్ సేథ్ మాట్లాడుతూ రక్షణ రంగానికి భారత నౌకాదళం చాలా కీలకమన్నారు. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా సర్వే నౌకను రూపొందించేందుకు భారత నావికాదళం సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్–ఇన్ చీఫ్, ఈస్టర్న్ నేవల్ కమాండ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో సీనియర్ సైనిక అధికారులు కూడా పాల్గొన్నారు. కాగా, ఈ నౌక 80% స్వదేశీ పరిజ్ఞానంతో కోల్‌కతాలో నిర్మితమయింది.

---------------------------

నూజివీడు మామిడికి మరింత ప్రాచుర్యం కల్పించేలా నూజివీడు మార్కెట్ యార్డును అభివృద్ధి చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ శాఖమంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఏలూరు జిల్లా నూజివీడులోని మామిడి మార్కెట్ యార్డు సౌకర్యాలపై మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాణ్యమైన మామిడి పంటకు రైతులు కృషి చేయాలన్నారు. మామిడి రైతుల కోసం మార్కెట్ యార్డులో వివిధ మౌలిక సదుపాయాలను 30 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. మామిడి పంటకు భీమా పథకాన్ని త్వరలో అమలు చేస్తామని మంత్రి వివరించారు.

=====================